సాక్షి
వనపర్తి
ఆదివారం । 10 । ఆగస్టు । 2025





## 'రాఖీ' సందడి

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం ఉమ్మడి జిల్లాలోని ప్రయాణ ప్రాంగణాలు, బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

-8లో ▸



## .. పోటెత్తిన భక్తజనం

శ్రావణ శనివారం, రాఖీ పౌర్ణమి సందర్భంగా అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

-8లో ▸

## వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.0 /21.2

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



**వీపనగండ్ల:** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని.. అనారోగ్యం బారిన పడిన వారికి కార్పొరేట్ వైద్యం అందుతుందని జిల్లా పర్యాటకశాఖ అధికారి నర్సింహ అన్నారు. శనివారం మండలంలోని కల్వరాలలో బత్తుల ఈశ్వరమ్మకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసి మాట్లాడారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో పలు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడమే గాకుండా గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఆదివారం గ్రామంలో 220 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు చింత దయాకర్, తిరుపతయ్య, ఆంజనేయులు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గోపాల్‌పేటలో భారీ వర్షం



**గోపాల్‌పేట:** ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి చెరువులు, కుంటలు అలుగు పారాయి. గోపాల్‌పేట పెద్దచెరువు, కత్వ, తాడిపర్తి చెరువు, రేవల్లి మండలంలోని చెరువులు, కుంటలు నిండాయి. కేశంపేట గేట్ వద్ద నీరు రహదారిపై ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గోపాల్‌పేట మండలంలో 96.2 మి.మీ., రేవల్లి మండలంలో 65.7 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు చెప్పారు. ఈ ఏడాది వర్షాకాలంలో ఈ స్థాయిలో వర్షపాతం నమోదు కావడం ఇదే తొలిసారని తెలిపారు.

### గిరిజన రైతుల నిరసన ప్రదర్శన

**పాన్‌గల్:** మండలంలోని కిష్టాపూర్‌తండాకు చెందిన 12 మంది గిరిజన రైతులపై అటవీశాఖ అధికారులు పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలంటూ శనివారం మండల కేంద్రంలో గిరిజనులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్, మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరసాగర్ పాల్గొని రైతులకు మద్దతు తెలిపి మాట్లాడారు. తండాల్లో గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టాదారు పాసు పుస్తకాలు ఉండి సాగు చేసుకుంటున్న భూముల్లో చెట్లు నరికివేశారని అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేసి వేధించడం సరికాదన్నారు. మంత్రి జూపల్లి నియోజకవర్గంలో గిరిజనులపై కేసుల నమోదు ప్రజాపాలనా అని ప్రశ్నించారు. ఇప్పటికైన అధికారులు, అధికార పార్టీ నేతలు స్పందించి గిరిజన రైతులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని లేకుంటే జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సోంనాథ్‌నాయక్, బీఆర్‌ఎస్ పార్టీ మండలఉపాధ్యక్షుడు తిలకేశ్వర్‌గౌడ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, సరోజమ్మ, చంద్రూనాయక్, సుధాకర్‌యాదవ్, సుధాకర్‌నాయక్, బాలస్వామి, కృష్ణ, శాంతన్న, రాంచందర్‌రావు, ఈశ్వర్‌లాల్‌జీ, రవికుమార్ రెడ్డి, గిరిజన రైతులు పాల్గొన్నారు.



# చెరువులకు జలకళ

## భూత్పూర్ రిజర్వాయర్ కాల్వకు నీటి విడుదల



నీటితో కళకళలాడుతున్న అమరచింత పెద్ద చెరువు

- 32.2 కిలోమీటర్ల పొడవున విస్తరించిన కాల్వ
- నిండుకుండను తలపిస్తున్న 28 చెరువులు
- మూడు మండలాలు.. 22,700 ఎకరాల ఆయకట్టు

**అమరచింత:** భూత్పూర్ రిజర్వాయర్ ప్రధాన ఎడమ కాల్వ ద్వారా అమరచింత, ఆత్మకూర్, నర్వ మండలాలతో పాటు మక్తల్ మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందిస్తున్నారు. నెలరోజులుగా కాల్వకు నీటిని వదులుతుండటంతో ఆయా గ్రామాల్లోని రైతులు తమ పొలాలకు నీటిని మళ్లించుకొని పంటలు సాగు చేస్తుండటంతో పాటు 28 చెరువులు నీటితో నింపారు. దీంతో ఆయా చెరువుల కింద ఉన్న ఆయకట్టుకు సైతం సాగునీరు అందించేందుకు భూత్పూర్ రిజర్వాయర్ అధికారులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. కాల్వ పరిధిలోని ఆయా మండలాల్లో 22,700 ఎకరాల ఆయకట్టులో ఈసారి వానాకాలం వరితో పాటు ఆరుతడి పంటలైన పత్తి, ఆముదం, కంది తదితర పంటలు సైతం సాగుచేస్తున్నారు. అలాగే ఆయకట్టు రైతులు కాల్వ వెంట ఉన్న డిస్ట్రిబ్యూటరీల మరమ్మతుతో పాటు ముళ్లపొదలు, పూడికతీత పనులు సైతం చేపడుతూ నీటిని తమ పొలాలకు తరలించుకుపోతున్నారు. 32 కిలోమీటర్ల పొడవున్న కాల్వకు లైనింగ్ చేపట్టినా అంచుల వెంట ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో నీటిపారుదలశాఖ అధికారులు వేసవిలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా తొలగిచడంతో వానకాలంలో కాల్వలో నీటిని పొందగలుగుతున్నారు.



పొక్లెయిన్‌తో కాల్వలో పూడిక తొలగింపు (ఫైల్)

**దాత సహకారంతో..**

రిజర్వాయర్ ఎడమ కాల్వలో ఈసారి భారీగా మట్టి పేరుకుపోవడం, ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో నీరు ముందుకు పారడం లేదని ఆయా గ్రామాల రైతులు నీటిపారుదలశాఖ అధికారులకు విన్నవించారు. వారు స్పందించకపోవడంతో నాగిరెడ్డిపల్లి, పాంరెడ్డిపల్లి, మస్తీపురం, పిన్నంచర్ల, అమరచింత రైతులు మాజీ అడ్వొకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డిని కలిసి సాగునీటి కష్టాలను వివరించారు. కాల్వ పూడికతీతకు అవసరమైన ఖర్చు స్వయంగా భరిస్తానని అధికారులకు హామీ ఇవ్వడంతో యుద్ధప్రాతిపదికన పూడికతీత, ముళ్ల పొదల తొలగింపు పనులు చేపట్టారు. ప్రస్తుతం కాల్వ ద్వారా ఆయా గ్రామాల చెరువుల్లోకి నీరు చేరుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

> **ఆయకట్టుకు సాగునీటి సరఫరా..**
>
> 
>
> రిజర్వాయర్ పరిధిలోని 22,700 ఎకరాలకు సాగునీటిని అందించేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. కాల్వలో పూడికతీత, ముళ్లపొదల తొలగింపు ఉపాధిహామీ పనుల్లో చేపట్టాం. మరికొన్ని చోట్ల దేశాయి ప్రకాష్‌రెడ్డి సహకారంతో పూడిక తొలగింపు పనులు చేపట్టడంతో ప్రస్తుతం నీరు చెరువులకు చేరుతోంది.
>
> – సతీష్‌కుమార్, డీఈ, భూత్పూర్ రిజర్వాయర్

### జూరాల వెనక జలాల నుంచి..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వెనక జలాల నుంచి భూత్పూర్ రిజర్వాయర్‌కు సాగునీటిని వదులుతున్నారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద వస్తున్న సమయంలో రిజర్వాయర్‌కు నీటిని తరలించడంతో పాటు కాల్వల ద్వారా ఆయా గ్రామాల్లోని చెరువులు నింపుతున్నారు. చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగడంతో పాటు మత్స్యకారులు చేపల పెంపకం చేపడుతున్నారు. పదేళ్లగా భూత్పూర్ రిజర్వాయర్ నుంచి వానాకాలంలో నీటిని వదులుతుండటంతో అమరచింత, ఆత్మకూర్, నర్వ, మక్తల్ మండలాల్లోని సుమారు 50 గ్రామాల రైతులకు సాగునీరు అందిస్తున్నారు. దీంతో సాగునీరు లేక గత కొన్ని సంవత్సరాలుగా బీళ్ళుగా మారిన పంట పొలాలు పది సంవత్సరాలుగా పంట పొలాలు పచ్చని పంటలతో కళకళ లాడుతున్నాయి. భూత్పూర్ రిజర్వాయర్ ఎడమ కాల్వ అమరచింత పెద్ద చెరువు వరకు విస్తరించి ఉండటంతో చివరగా అమరచింత పెద్ద చెరువు నిండి అక్కడి నుంచి ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్ల, ఆత్మకూర్ చెరువులకు నీటిని తరలిస్తున్నారు.



భూత్పూర్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న నాబార్డు బృందం (ఫైల్)

# కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం

**ఖిల్లాఘనపురం:** కాంగ్రెస్ పాలనలోనే పేదల సొంతింట కల నెరవేరుతుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టిన మహిళ రాజేశ్వరికి మొదటి చెక్కు రూ.లక్ష అందజేసి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ పాలనలో పేదలు ఇంటి మంజూరుకుగాను నాయకులు, అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగినా ఉపయోగం లేకపోయిందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పేదలకు ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విడతల వారీగా అర్హులందరికీ ఇళ్లు మంజూరవుతాయని చెప్పారు.



ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**పండుగలు భక్తిభావాన్ని పెంపొందిస్తాయి..**

పండుగలు, ఉత్సవాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించి సన్మార్గంలో పయనించేందుకు ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో భక్త మార్కండేయ ఉత్సవాలను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని గ్రామంలోని దేవాలయం నుంచి గుట్ట పై ఉన్న నర్సింహస్వామి ఆలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ రాజు, మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి, గంజాయి రమేష్, ఆగారం ప్రకాష్, నాయకులు బాలకృష్ణారెడ్డి, విజయలక్ష్మి, రామకృష్ణారెడ్డి, రవినాయక్, జయకర్, నవీన్‌కుమార్‌రెడ్డి, యాదగిరి, శ్రీరాములు, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామన్‌పాడుకు వరద

- రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

**మదనాపురం:** జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి శంకరసముద్రం ద్వారా 1200 క్యూసెక్కులు, ఊకచెట్టు వాగు ద్వారా 300 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వ నుంచి 185 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 83 క్యూసెక్కుల వరద మండలంలోని రామన్‌పాడు జలాశయానికి వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు శనివారం రెండు గేట్లు పైకెత్తి 1,200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 1,021 అడుగుల నీటిమట్టం ఉంది. అలాగే జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 15 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 97 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ వివరించారు.



జలాశయం నుంచి దిగువకు పారుతున్న వరద

## శనేశ్వరుడికి తైలాభిషేకాలు



**బిజినేపల్లి:** నందివడ్డెమాన్ జ్యేష్ఠాదేవి సమేత శనేశ్వరుడికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు శనేశ్వరాలయాన్ని సందర్శించి తమ ఏలినాటి శనిదోష నివారణ కోసం స్వామివారికి తిల తైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మసూత్ర పరమశివుడిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాల్‌రావు, ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి, కమిటీ సభ్యులు రాజేశ్, ప్రభాకరాచారి, పుల్లయ్య, వీరశేఖర్, అర్చకులు శాంతికుమార్, ఉమ్మయ్య పాల్గొన్నారు.

# ఔత్సాహికులకు వరం.. వాలీబాల్ అకాడమీ



వాలీబాల్ అకాడమీలో సాధన చేస్తున్న క్రీడాకారులు

### మహబూబ్‌నగర్‌లో నూతన వాలీబాల్ స్టేడియం ఏర్పాటు

- శిక్షణ పొందుతున్న వివిధ జిల్లాల క్రీడాకారులు
- బాల, బాలికలకు మెరుగైన వసతి సౌకర్యాలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక శిక్షణ
- అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా ముందుకు..

**మహబూబ్‌నగర్ క్రీడలు:** ఔత్సాహిక వాలీబాల్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి 2004లో రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ జిల్లాకు వాలీబాల్ అకాడమీ మంజూరు చేసింది. అకాడమీ నడిచిన నాలుగేళ్లలో జిల్లా క్రీడాకారులు ఎంతో ప్రతిభ కనబరిచేవారు. అప్పట్లో ఈ వాలీబాల్ అకాడమీ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు సంతరించుకుంది. వాలీబాల్ అకాడమీలో శిక్షణ పొందిన జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారులుగా ఎదిగారు. అయితే నిధుల నిర్వహణ భారంతో 2008 సంవత్సరంలో వాలీబాల్ అకాడమీని మూసివేశారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధుల కృషి, అధికారుల చొరవతో మరోసారి వాలీబాల్ అకాడమీ ఏర్పాటై.. పూర్వవైభవం సంతరించుకునే దిశగా ముందుకు సాగుతోంది.

### క్రీడాకారులకు మెరుగైన శిక్షణ

వాలీబాల్ అకాడమీలో ప్రవేశాలు పొందిన బాల, బాలికలకు మెరుగైన శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం ఒక కోచ్ ఉండగా త్వరలో మరో కోచ్ రానున్నారు. కోచ్ పర్వేజ్‌పాషా క్రీడాకారులకు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఉదయం వేళలో రిక్రియేషన్ గేమ్, స్ట్రెచ్చింగ్ ఫ్లెక్సిబిలిటీ, గ్రౌండ్ మూమెంట్, బాల్ డ్రిల్స్, సాయంత్రం బ్లాకింగ్, అటాకింగ్ డ్రిల్స్, బాల్ ప్రాక్టీస్‌పై శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రతి శుక్రవారం ఐదు సెట్ల మ్యాచ్ ఆడిపిస్తున్నారు.

**అధునాతన సౌకర్యాలతో..**

మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో నూతన వాలీబాల్ అకాడమీ రూ.19.70 లక్షల నిధులతో ఏర్పాటు చేశారు. స్టేడియంలోని రెండు పాత వాలీబాల్ కోర్టులను ఆధునీకీకరించి వాటి స్థానంలో నూతన కోర్టులు నిర్మించారు. కోర్టుల చుట్టూ నాలుగు ఫ్లడ్‌లైట్లు, ప్రత్యేక షెడ్లు, గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జూన్ 12న వాలీబాల్‌లో అకాడమీలో ప్రవేశాల కోసం సెలక్షన్స్ నిర్వహించగా.. రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి బాల, బాలికలు హాజరయ్యారు. అకాడమీలో 32 మంది బాలురు, బాలికలు ప్రవేశాలు పొందారు. స్విమ్మింగ్‌పూల్ అంతస్తులో బాలురకు, ఇండోర్ స్టేడియంలో బాలికలకు వసతి ఏర్పాటు చేశారు. అదేవిధంగా భోజన వసతి కల్పించారు.

### వేసవి శిబిరం నుంచి..



ఈ ఏడాది మెయిన్ స్టేడియంలో జరిగిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరంలో పాల్గొన్నా. ఇక్కడ వాలీబాల్ శిక్షణ బాగుంది. కోచ్ సలహాతో అకాడమీ సెలక్షన్స్‌లో పాల్గొని వాలీబాల్‌లో అకాడమీకి ఎంపికయ్యాను. గేమ్‌లో అటాకర్‌గా ఆడుతున్నా. భవిష్యత్‌లో భారత జట్టుకు ఆడాలని ఉంది.

– సాయికీర్తన, నంచర్ల, మహబూబ్‌నగర్

### జాతీయస్థాయిలో ఆడాను..



మూడేళ్ల నుంచి వాలీబాల్ శిక్షణ తీసుకుంటున్నా. గత సంవత్సరం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 జాతీయస్థాయి వాలీబాల్ టోర్నీలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాను. భవిష్యత్‌లో వాలీబాల్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఉంది. లక్ష్యం దిశగా ముందుకెళ్తున్నా.

– వైష్ణవి, శాగాపూర్, వనపర్తి

### ఉద్యోగం సాధించడమే లక్ష్యం..



వాలీబాల్ అంటే చాలా ఇష్టం. వాలీబాల్ అకాడమీకి ఎంపికైనందుకు చాలా ఆనందంగా ఉంది. గతంలో ఎస్‌జీఎఫ్ అండర్- 14, అండర్- 14 రాష్ట్రస్థాయి టోర్నీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించాను. గతేడాది సీఎం రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనగా ద్వితీయ స్థానం వచ్చింది. భవిష్యత్‌లో ప్రొఫెషనల్ క్రీడాకారుడిగా ఎదగడంతోపాటు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నా.

– ప్రశాంత్, పల్లెగడ్డ, మహబూబ్‌నగర్



### సంతోషంగా ఉంది..

మా ఊరిలోనే వాలీబాల్ ప్రాక్టీస్ చేసేవాడిని. రాష్ట్రస్థాయి సెలక్షన్స్ ఉందని స్నేహితుల ద్వారా తెలుసుకొని పాల్గొన్న. వాలీబాల్ అకాడమీకి ఎంపికైనందుకు సంతోషంగా ఉంది. 2024లో ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా టోర్నీలో ఆడాను. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని ఉంది.

– శంకర్, మంచిర్యాల

### రెండేళ్ల నుంచి సాధన



మొదటిసారి వాలీబాల్ అకాడమీకి ఎంపికయ్యాను. రెండేళ్ల నుంచి ప్రాక్టీస్ చేస్తున్న. సిద్ధిపేట, మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ సెలక్షన్స్‌కు వెళ్లాను. ఈ రెండింట్లో కూడా ఎంపికయ్యాను. కానీ, మహబూబ్‌నగర్ అకాడమీలో చేరాను. ఇక్కడ వసతులు బాగున్నాయి. అటాకర్‌గా శిక్షణ తీసుకుంటున్న.

– నరేష్, ఇప్పలపల్లి, రంగారెడ్డి

### అందరిలో పట్టుదల ఉంది..



వాలీబాల్ అకాడమీలోని క్రీడాకారుల్లో నేర్చుకోవాలనే పట్టుదల ఉంది. వచ్చే 15 రోజుల్లో వారిలోని నైపుణ్యం ఏమిటో బయటకు వస్తుంది. క్రీడాకారులకు క్రమపద్ధతిలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక వాలీబాల్ శిక్షణ అందజేస్తున్నాం. క్రీడాకారులు ఫిట్‌నెస్, శిక్షణపై దృష్టిసారించాలి.

– పర్వేజ్‌పాషా, వాలీబాల్ కోచ్

### నైపుణ్యాన్ని చాటుకోవాలి..



వాలీబాల్ అకాడమీలో క్రీడాకారులకు మెరుగైన క్రీడా శిక్షణ లభిస్తుంది. క్రీడాకారులు దీనిని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాన్ని చాటుకోవాలి. వాలీబాల్ అకాడమీలో ప్రవేశాలు పొందిన క్రీడాకారులకు వసతి, భోజన వసతి ఏర్పాటు చేశాం. త్వరలో ఇతర క్రీడలకు సంబంధించి అకాడమీలు కూడా వచ్చే అవకాశం ఉంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

# భూలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

**కొత్తకోట రూరల్:** పట్టణ సమీపంలోని వెంకటగిరి క్షేత్రంలో వెలిసిన భూలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం శనివారం కనులపండువగా నిర్వహించారు. అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి వేద మంత్రోచ్చారణల నడుమ మేళతాళాలతో స్వామివారి కల్యాణ క్రతువు జరిపించారు. దంపతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా ఆడపడుచులు అమ్మవారికి వడి బియ్యం పోశారు. వేడుకకు పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలను పల్లకీలో ఉంచి ప్రత్యేక పూజలు చేసి గోవింద నామస్మరణతో ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు సింగరాచార్యులుతో పాటు ఆలయ నిర్వాహకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు శెట్టి, మొద్దు దామోదర్‌రెడ్డి, సంద వెంకటేష్, జలంధర్‌గౌడ్, తిరుపతయ్య, నీలేష్‌కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, గురుస్వామి, కృష్ణారెడ్డి ఉన్నారు.



పల్లకీ సేవలో భూలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారు

**తిరుమలయ్యగుట్ట భక్తజన సంద్రం..**

**వనపర్తి రూరల్:** శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా మండలంలోని పెద్దగూడెం శివారు తిరుమలయ్య గుట్ట భక్తజన సంద్రంగా మారింది. ఆలయ అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అంకురార్పణ పూజలు జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోగా.. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు దాతలు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుమలయ్య గుట్టపై భక్తులు



మక్తల్‌లో మంత్రి వాకిటి శ్రీహరికి రాఖీ కట్టి ఆశీర్వదిస్తున్న సోదరీమణులు



మహబూబ్‌నగర్ బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్ తదితరులు



వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి రాఖీ కడుతున్న సోదరి



అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు రాఖీ కట్టి ఆశీర్వదిస్తున్న సోదరీమణులు



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహాదేవి

## రాఖీ కట్టి.. మనసారా ఆశీర్వదించి..

ఆడపడుచులకు సోదరులపై ఉండే ఎల్లలు లేని ప్రేమ, ఆప్యాయత నిదర్శనమే రాఖీ. రాఖీ పండుగను పురస్కరించుకొని శనివారంమంత్రి వాకిటి శ్రీహరికి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వారి సోదరీమణులు రాఖీ కట్టారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆయన సోదరి కుమార్తె సరళ, అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణకు సోదరీమణులు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి బ్రహ్మకుమారీస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బీకే మహాదేవి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సోదరి శ్రీదేవి రాఖీ కట్టి ఆశీర్వదించారు. వారు జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

– సాక్షి, నెట్‌వర్క్



కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి రాఖీ కడుతున్న సరళ



మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న సోదరి శ్రీదేవి

# కల్యాణ.. వైభోగమే

### మన్యంకొండలో వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

**మహబూబ్‌నగర్ రూరల్:** పౌర్ణమిని పురస్కరించుకొని మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో స్వామి దంపతులను సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం స్వామివారి కల్యాణ వేడుక జరిగింది. జీలకర్ర, బెల్లం, మంగళసూత్రధారణ, తలంబ్రాల కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి దంపతులను మళ్లీ పల్లకీలో గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి పాల్గొన్నారు.



క్యూలో నిల్చొన్న భక్తులు

### వైభవంగా లక్ష్మీ హయగ్రీవుల కల్యాణం



శ్రీలక్ష్మీ హయగ్రీవ కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

**ఎర్రవల్లి:** శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని బీచుపల్లి క్షేత్రంలోని కోదండరామ స్వామి ఆలయంలో శనివారం శ్రీలక్ష్మీ హయగ్రీవుల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి.. సన్నాయి వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణ వేడుక జరిపారు. కాగా, పవిత్రోత్సవాల చివరిరోజు ఆలయంలో వేద దివ్యప్రభంద పారాయణం, యాగశాలలో చతుస్థానార్చన, మూలమంత్ర మూర్తి హోమాలు, శాంతిహోమం, మహా పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, కుంభప్రోక్షణ, మహానివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు పాల్గొన్నారు.

### కురుమూర్తికి పోటెత్తిన భక్తజనం

**చిన్నచింతకుంట:** శ్రావణ రెండో శనివారం, పౌర్ణమిని పురస్కరించుకొని కురుమూర్తి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి.. స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. స్వామివారి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. కొందరు భక్తులు సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. అమ్మాపురం సంస్థానాధీశుడు రాజ శ్రీరాంభూపాల్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సు ఎక్కుతూ..



ముందుగానే సీటు వేస్తూ..

## ‘రాఖీ’ సందడి

రాఖీ పండుగను పురస్కరించుకొని శనివారం ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు కిటకిటలాడాయి. మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు ఆరుబయట సైతం జనం రద్దీ కనిపించింది. ప్లాట్‌ఫాంపైకి బస్సు రాగానే ప్రయాణికులు ఎగబడి ఎక్కారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మరోవైపు స్వగ్రామాలకు వెళ్లే వారితో రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. జాతీయ రహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. జడ్చర్ల ఫ్లైఓవర్ వద్ద ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు, తిరిగి సాయంత్రం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఏర్పడింది. పెద్దఎత్తున వాహనాలు రోడ్డుపైకి రావడంతో క్రమబద్ధీకరించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. జడ్చర్ల సిగ్నల్ గడ్డ వద్ద సైతం షరా మామూలే అన్నట్టుగా ట్రాఫిక్ జాం ఏర్పడింది.

– సీనియర్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్/జడ్చర్ల టౌన్



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్







జడ్చర్ల ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్‌జాం, మహబూబ్‌నగర్‌లో బస్టాండ్ ఆరుబయట బస్సుల కోసం ఎదురుచూస్తూ...,మహబూబ్‌నగర్ ఎల్లమ్మ గుడి వద్ద ట్రాఫిక్ జాం

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**భూత్పూర్:** పట్టణం సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. భూత్పూర్ నుంచి మూసాపేట వైపు నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని(45) గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు నల్లని చెక్స్ చొక్కా, లుంగీ ధరించి ఉన్నట్లు, మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రిలో తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### బైక్ పైనుంచి పడి..

**అడ్డాకుల:** 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. ఎస్‌ఐ వేణు కథనం మేరకు.. మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన సంగు వెంకటయ్య (65) బోరు మోటార్ బాగు చేయించడానికి మహబూబ్‌నగర్‌కు వెళ్లాడు. తిరిగి ద్విచక్రవాహనంపై అదే గ్రామానికి చెందిన సీతారాములుతో కలిసి వస్తుండగా మూసాపేట సమీపంలోని ఈద్గా వద్ద రోడ్డు పక్కన ఉంచిన సిమెంట్ దిమ్మెను బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో వెనుక కూర్చున్న వెంకటయ్య కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వెంకటయ్య మృతి చెందాడు. సీతారాములుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. మృతుడి కుమారుడు కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### మహిళ బలవన్మరణం

**గద్వాల క్రైం:** కుటుంబ కలహాలు తాళలేక మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఘటన గద్వాల మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు... కొత్తపల్లి గ్రామానికి చెందిన కాపు సుజాత (45), భర్త ఈశ్వర్‌రెడ్డి కొన్ని రోజులుగా ఆర్థిక పరమైన విషయాలపై తరచూ ఘర్షణ పడుతున్నారన్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో మనస్తాపం చెందిన సుజాత అర్ధరాత్రి చీరతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలన్మరణానికి పాల్పడింది. శనివారం గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినటు వైద్యుల్లు ధృవీకరించారు. ఈ ఘటనపై కుమారుడు సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## జూరాలకు మళ్లీ పెరిగిన వరద

- 1.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 8 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

**ధరూరు:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద మళ్లీ పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో 40 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం రాత్రి 8.30 ప్రాంతంలో 1.15 లక్షల క్యూసెక్కులకు పెరిగినట్లు వివరించారు. దీంతో 8 క్రస్ట్ గేట్లు ఎత్తి 57,136 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు చెప్పారు. అలాగే విద్యుదుత్పత్తికి 33,419 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్ట్–1కు 650, ఆవిరి రూపంలో 46, కుడి కాల్వకు 700, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.193 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వివరించారు.

**విద్యుదుత్పత్తి వేగవంతం..**

**ఆత్మకూర్:** జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతోంది. శనివారం ఎగువన 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 205.877 మి.యూ, దిగువన 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 244.102 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ వివరించారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటివరకు 449.979 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామని చెప్పారు.

**‘సంగంబండ’ ఒక గేట్ ఎత్తి..**

**మక్తల్:** మండలంలోని సంగంబండ వద్ద ఉన్న చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటి ప్రవాహం అధికం కావడంతో శనివారం ఒక గేట్ పైకెత్తి 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈ సురేష్ తెలిపారు. కర్ణాటకలోని ఇడ్లూర్ పెద్దవాగు నుంచి నీటి ప్రవాహం అధికంగా రావడంతో రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరిగిందని చెప్పారు.



జలాశయం నుంచి దిగువకు పారుతున్న వరద

**శ్రీశైలం జలాశయానికి..**

**దోమలపెంట:** కృష్ణా బేసిన్‌లో వరద పెరగడంతో జూరాల ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా శనివారం శ్రీశైలం జలాశయానికి నీటి విడుదల చేస్తున్నారు. జూరాల స్పిల్‌వే ద్వారా 57,136 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 53,768, హంద్రీ నుంచి 1,125 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతోందన్నారు. శ్రీశైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,465 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 879.1 అడుగుల నీటిమట్టం.. 183.4198 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 32,750 క్యూసెక్కులు, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,818, ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 15.776 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 14.982 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు.

## తాళం వేసిన ఇంటికి కన్నం

- 15 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ

**అచ్చంపేట రూరల్:** తాళం వేసిన ఇంటికి దొంగలు కన్నం వేసిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. అచ్చంపేట ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని శ్రీనివాస కాలనీకి చెందిన మేకల నిర్మల ఈ నెల 7న ఇంటికి తాళం వేసి ఉప్పునుంతలకు వెళ్లింది. తిరిగి శనివారం ఇంటికి వచ్చి చూడగా... తలుపునకు వేసిన తాళం విరగ్గొట్టి ఉండటాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 15 తులాల బంగారు వస్తువులు, రూ. 2 లక్షల నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఎత్తంలో తుపాకీ కలకలం

**కోడేరు:** ఓ వ్యక్తి తుపాకీతో తిరుగుతూ కలకలం సృష్టించిన సంఘటన మండలంలోని ఎత్తం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మండ్ల లక్ష్మయ్య శనివారం అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అతడిని పట్టుకుని విచారించగా జేబులో తుపాకీ కనిపించింది. వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కృష్ణయ్య తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



లక్ష్మయ్య నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకీ ఇదే..

## మట్టి ఇల్లు కూలి ఇద్దరికి గాయాలు

**గద్వాలటౌన్:** రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి స్థానిక వేదనగర్ కాలనీలో ఉన్న ఓ మట్టి ఇల్లు కూలిపోయింది. అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న వినోద్ కుటుంబ సభ్యులకు తృటిలో ప్రమాదం తప్పింది. వినోద్‌తో పాటు భార్య పల్లవి, కుమార్తె పావనికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామంజనేయులు పరామర్శించారు.



గద్వాలలో వర్షానికి కూలిన మట్టి ఇల్లు

## ముదురు నారులో యాజమాన్య పద్ధతలు

**అలంపూర్:** జిల్లాలో వరిసాగు విస్తారంగా ఉందని కొన్ని రోజుల్లో పూర్తి స్థాయిలో వరినాట్లు వేసే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్ అన్నారు. ఈ నేపథ్యంలో ముదురు నారులో యాజమాన్య పద్ధతులపై రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు.

**నీటి విడుదలలో జాప్యం**

నీటి విడుదల్లో జాప్యం, వర్షాభావ పరిస్థితులు, బోరు బావు కింద సాగు చేయడంలో సమస్యలు వంటివి కారణాలతో వరినాట్లు వేయడంలో జాప్యం జరిగే అవకాశం ఉంటుంది. దీంతో ముందుగా వేసుకున్న నారుమడ్లలో వరినారు ముదిరే అవకాశాలు లేకపోలేదు. ముదిరిన నారు వేసుకోనే యాజమాన్య పద్ధతుల్లో కేవలం సన్నరకం వరి వంగడాలకు మాత్రమే వర్తిస్తోందని వివరించారు.

**30 రోజులు దాటితే**

సాధారణంగా 30 రోజుల నారును నాటు వేస్తారు. సాలుకు మధ్య 20 సెంటిమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 15 సెంటిమీటర్ల దూరంతో నాటు వేసుకోవాలి. నారువేసి 30 రోజులు దాటిందంటే దానిని ముదిరిన నారుగా పరిగణించాలి. 30 నుంచి 40 రోజుల నారును నాటేటప్పుడు సాలుకు సాలుకు మధ్య 15 సెంటిమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 15 సెంటిమీటర్లు దూరంతో నాటుకోవాలన్నారు. 40 నుంచి 50 రోజుల నారును నాటేటప్పుడు సాలుకు మధ్య 15 సెంటిమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 10 సెంటిమీటర్లు స్థలాన్ని వదులుకోవాలన్నారు. ముదిరిన నారు నాటేటప్పుడు నారు పిలకలు ఎక్కువగా నాటాలి. కుదురుకు 4 లేదా 5 మొక్కల చొప్పున నాటు వేసుకోవాలి.



వరి నారుమడులు

**రెట్టింపుతో ఎరువుల వాడకం**

ముదురు నారు పొలానికి రెండు దఫాలుగా మాత్రమే ఎరువులు వేయాలి. అది కూడా రెట్టింపుతో వాడాలి. ముదురు నారు నాటినప్పుడు నత్రజని ఎరువు అధికంగా వాడాలి, 70 శాతం దమ్ము దశలో 30 శాతం అంకుర దశలో వాడాలి. భాస్వరం ఎరువు 50 శాతం పొటాష్‌తో ఎరువుతో కలిపి మొదటిసారి దమ్ములో వేయాలి. ఇలా చేయడం వలన పిలకలు తొందరగా వేసి దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. మొదటి దఫా (నాటు వేసే సమయంలో) 50 కేజీల యూరియా, 50 కేజీల డీఏపీ, 15 కేజీల పొటాష్ వేస్తే సరిపోతుంది. ఇలా చేయడంతో దిగుబడి తగ్గకుండా ఉంటుంది. వరినాటు సమయంలో 2 మీటర్ల తర్వాత 20 సెంటిమీటర్ల చొప్పున తూర్పు, పడమరలుగా కాలిబాటలు వదలడం మంచిది. దీంతో పంటకు గాలి బాగా తగులుతుంది. పైగా తెగుళ్ల సోకకుండా ఉంటుంది.

### జిల్లాలో వరి సాగు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో దాదాపు 55 వేల ఎకరాల్లో పంట సాగు చేపడుతున్నట్లు తెలిపారు. గతేడాది 80 వేల ఎకరాల్లో పంట సాగు జరిగింది. కానీ ఈ ఏడాది వరిసాగు 55 వేల ఎకరాల్లో జరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.


## సాక్షి క్లాసిఫైడ్స్

**REAL ESTATE**

**HOUSE FOR SALE**

■ నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలో మూడు పోర్షన్లు కల్గిన 220 గజాల ఇల్లు అమ్మబడును. సంప్రదించండి. సెల్ : 9059211546

**SERVICES**

**ఓల్డ్ ఏజ్ హోమ్ / హోమ్ కేర్ సర్వీస్**

■ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్/ హోమ్ కేర్ సర్వీస్ 24 గం॥, 12 గం॥ వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి & వంట పనికి మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పులను పంపించగలము. సంప్ర॥ 8977263124, 9100116067.

**ASTROLOGY**

■ జ్యోతిష్యం వాటికి పరిష్కారం చూపబడును ( ప్రేమ వివాహం, సంతానం, విద్య, వ్యాపారం,విదేశీయానం) మొ. సమస్యలకై 9989689194 బాబారజా ఖాన్

**CHANGE OF NAME**

■ I, K A Saralamma W/o Devigari Ramulu, R/o H-No: 6-66/1, Rudraram Village, Kodangal Mandal, Vikarabad Dist. Telangana - 509336, do hereby declare that my name DEVIGARI SARALAMMA (old name) to K A SARALAMMA have changed (new name) for all future, purposes.

**WANTED**

■ షిరిడిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడి వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యభర్తలు కావలెను. ఫోన్: 8985114453, 9391036931

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
మహబూబ్‌నగర్ : 9705135557, 9010869797
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి/గద్వాల: 9553955603
నారాయణపేట : 9010962007

**గమనిక**

– సాక్షి మేనేజర్